క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి


ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును కలిసిన వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పండన్న

జి.మాడుగుల: వైఎస్సార్‌సీపీ అరకు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియామకమైన పండన్న శుక్రవారం పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమించినందుకు వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధిష్టానం తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం కోసం తన వంతు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు ధన్యవాదాలు తెలిపారు.

ఆత్మీయ సన్మానం


ఉద్యోగ విరమణ చేసిన నారాయణ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జి.మాడుగుల: మండలంలో బీరం పంచాయతీ తాడివీధి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న దూరు నారాయణ ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయనను సుర్మతి కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్యామసుందరం, హెచ్‌ఎం ప్రభావతి, డిప్యూటీ వార్డెన్ రాజేశ్వరి, కైలాసం, తదితరులు పాల్గొన్నారు.

నాగుపాము కలకలం


పోతురాజు గుడివద్ద ప్రత్యక్షమైన నాగుపాము

హుకుంపేట: స్థానిక మోదకొండమ్మ అమ్మవారి ఆలయానికి అనుకుని ఉన్న పోతురాజు గుడి వద్ద శుక్రవారం నాగుపాము ప్రత్యక్షమైంది. గుడి వద్ద శివుడు,దుర్గమ్మ,మోదకొండమ్మ అమ్మవారి విగ్రహాలు ఉన్న ప్రదేశంలో దాదాపు 15 నిమిషాల పాటు కదలకుండా పాము ఉన్నట్టు స్థానికులు గుర్తించారు. అనంతరం సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లినట్టు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు

కొయ్యూరు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు మండలంలో ప్రశాంతంగా జరిగేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్టు తహసీల్దార్ ప్రసాద్ చెప్పారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని రాజేంద్రపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పోలింగ్ కేంద్రంగా ఏర్పాటుచేసినట్టు తెలిపారు. మండల వ్యాప్తంగా ఉపాధ్యాయ ఓటర్లు 161 మంది ఉన్నట్టు చెప్పారు. ఎన్నికను ప్రశాంతంగా నిర్వహిస్తామని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు.

విద్యార్థులకు అభినందనలు

నర్సీపట్నం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు పెదబొడ్డేపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిని హెచ్‌ఎం ఫ్రాన్సిస్ శుక్రవారం అభినందించారు. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు రుత్తల జాగృతి, కేశనకుర్తి కుసుమ కుమార్ ఇటీవల నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ టెస్ట్‌లో అర్హత సాధించారు. ఆర్థికంగా వెనుకబడిన, ప్రతిభగల విద్యార్థులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఏటా ఉపకారవేతనాన్ని అందిస్తోంది. ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ. వెయ్యి చొప్పున ఏడాదికి రూ.12 వేలు అందిస్తుంది.


రోలుగుంట: మండలంలో పలు పాఠశాలల నుంచి ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. కొవ్వూరు పాఠశాల నుంచి షేక్ ఆయేషా బేగం, బుచ్చింపేట జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఎస్.కీర్తి ప్రియ, జె.నాయుడుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి పడాల భారతి, హనుమంతు చిరంజీవి ఎంపికయ్యారు. వీరిని ఆయ పాఠశాలల హెచ్‌ఎంలు దాడిశెట్టి రమేష్‌కుమార్, దేముడుబాబు, శేఖర్ అభినందించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న మోదకొండమ్మ తల్లి ఆలయానికి భక్తులు తమ వంతు సాయం అందజేస్తున్నారు. మూలపేటకు చెందిన గాంధీ ఆలయ నిర్మాణానికి రూ.5వేల విరాళాన్ని గురువారం రాత్రి కమిటీ సభ్యులకు అందజేశారు.

దస్తూరీ.. మార్కుల సిరి

వదో తరగతి విద్యార్థులకు సూచనలు


రాతపై దృష్టి పెడితే మంచి మార్కులు

పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. విద్యార్థుల ధ్యాసంతా చదువు పైనే. ప్రణాళికబద్ధంగా ప్రతి సబ్జెక్టును రివిజన్ చేస్తుంటారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలనే లక్ష్యంతో చదువుతుంటారు. అయితే పరీక్షల్లో దస్తూరీ గురించి ఆలోచించే వారు కాస్త తక్కువనే చెప్పొచ్చు. చక్కటి రాతతో మంచి మార్కులు పొందవచ్చని ఉపాధ్యాయులు, మేధావులు చెబుతున్నారు. పరీక్షల్లో ప్రతి ప్రశ్నకు సూటిగా.. మంచి దస్తూరీతో సమాధానాలు రాయడంపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచిస్తున్నారు.

ముంచంగిపుట్టు: పరీక్షల్లో సమాధానాలు ఉన్నది ఉన్నట్టు రాసినా.. ఎంత మంచి దస్తూరీతో రాశామన్నది కూడా మార్కులు పొందడంలో కీలకం. మూల్యాంకనం చేసేవారికి సమాధానాలు స్పష్టంగా అర్థమైతే ఎక్కువ మార్కులు వేసేందుకు అవకాశం ఉంటుంది. ఏడాది పాటు చదివిన అంశాలను రెండున్నర గంటల్లో సమాధానాలు రాయాలి. దీంతో పరీక్షల సమయంలో సహజంగానే విద్యార్థుల్లో ఆందోళన ఉంటుంది. మొదటి ప్రశ్నకు సమాధానం చక్కగా రాసి, తర్వాత వేగంగా పూర్తి చేయాలనే ఆత్రుతతో రాతపై అంతగా దృష్టి సారించరు. దీనిని అధిగమించాలంటే దస్తూరీపై సాధన చేస్తే పరీక్షల్లో ఇబ్బందులు ఉండవని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఆణిముత్యాల్లాంటి అక్షరాల కోసం కొన్ని ప్రాథమిక సూత్రాలు పాటించాలంటున్నారు. ఇందుకోసం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ, దస్తూరీపై శిక్షణ ఇస్తున్నారు.



కిలగాడలో దస్తూరీ ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థినులు


ముంచంగిపుట్టు బాలికల పాఠశాల-2లో దస్తూరీ ప్రాక్టీస్ చేయిస్తున్న ఉపాధ్యాయులు

ఈ జాగ్రత్తలు పాటించాలి

- సమాధాన పత్రంలో రాసే జవాబు సూటిగా ఉండడంతో పాటు అక్షరాలు పొందికగా ఉంటే పేపరు దిద్దేవారు గరిష్ట మార్కులు వేసే అవకాశం ఉంటుంది.
- పేజీ పై భాగంలోను, ఎడమ వైపు ఒక అంగుళం మార్జిన్ విడిచి పెట్టాలి.
- పెన్ను సక్రమంగా పట్టుకొని రాస్తే.. రాసే అక్షరాలు అందంగా.. గుండ్రంగా ఉంటాయి.
- జవాబులు రాసేటప్పుడు ప్యాడ్ పైకి వాలిపోకుండా సాధ్యమైనంత వరకూ నిటారుగా కూర్చుని రాయడం మంచిది.
- సామాన్య, భౌతిక శాస్త్రాల్లో బొమ్మలు గీసి, భాగాలు గుర్తించే విషయంలో పెన్ను ఒత్తి పెట్టి రాయకూడదు. ఇలా చేస్తే పేపరు వెనుక అసహ్యంగా కనిపిస్తుంది.
- పేజీలో వాక్యాలు పైనుంచి కింది వరకు ఒకే వరుస క్రమంలో ఉండాలి.
- పేజీకి 16 నుంచి 20 లైన్లు మించి రాయకూడదు.
- అక్షరాలు, పదాలు, వాక్యాల మధ్య తగినంత ఖాళీ ఉండాలి.
- రోజు కొద్దిగా సేపు సాధన చేస్తే పరీక్షల్లో ఆందోళన లేకుండా సాఫీగా రాయవచ్చు.

చేతిరాతపై అవగాహన



పదో తరగతి విద్యార్థులు అదనపు మార్కులకు చేతిరాత చాలా ముఖ్యం. చేతి రాతను బట్టి విద్యార్థి సామర్థ్యాన్ని అంచనా వేయవచ్చు. పాఠశాలలో నిర్వహించే ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్‌లో చక్కటి దస్తూరీతో ఎలా రాయాలో అవగాహన కల్పిస్తున్నాం. పలు సూచనలిస్తున్నాం. మానసిక ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని సూచిస్తున్నాం.

– ఎం.వి.ఎస్.ప్రకాశం, హెచ్‌ఎం, ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల-2, ముంచంగిపుట్టు

ప్రత్యేక సమయం కేటాయింపు



శాస్త్ర, సాంకేతిక రంగం ఎంత ఎదిగినా చేతిరాతకు ప్రాధాన్యం పెరుగుతూనే ఉంది. సంబంధిత భాషపై పట్టు ఉంటే రాయడం తేలిక అవుతుంది. దస్తూరీ బాగున్న విద్యార్థులు ఎక్కువ మార్కులు పొందే అవకాశం ఉంటుంది. మా పాఠశాలలో రోజు నిర్వహించే తరగతులలో చేతిరాతకు కొంత సమయం కేటాయిస్తున్నాం. పరీక్షల్లో పాటించాల్సిన జాగ్రత్తలపై తగు సూచనలిస్తున్నాం.

– మాణిక్యాలరావు, హెచ్‌ఎం, ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల-1, ముంచంగిపుట్టు

23న అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

ఉత్సవంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం


ఆంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ట వేడుకపై ప్రచారం చేస్తున్న ఆదివాసీ మహిళలు

రాజవొమ్మంగి: మండలంలోని బడదనాంపల్లి పంచాయతీ కిమ్మిలిగెడ్డ గ్రామంలో ఈనెల 23న అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ వేడుకపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు. ఉత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావాలని కోరారు.

ఉపాధి ఈసీలు, టీఏలకు నేడు శిక్షణ

చింతపల్లి: కొయ్యూరు, గూడెం కొత్తవీధి, చింతపల్లి మండలాల ఉపాధి హామీ పథకం ఈసీలు, టెక్నికల్ సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లకు క్లస్టర్ స్థాయిలో శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఏపీడీ లాలం సీతయ్య శుక్రవారం తెలిపారు. ఆయా మండలాల నుంచి విధిగా హాజరు కావాలన్నారు. మూడు మండలాల ఏపీవోలు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించాలన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం


కడుతుల గ్రామంలో తెలుగు భాష ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


రంపచోడవరంలోని డిగ్రీ కళాశాలలో పాల్గొన్న ప్రిన్సిపాల్ వసుధ తదితరులు

ముంచంగిపుట్టు: మండలంలోని పనసపుట్టు పంచాయతీ కడుతుల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ సిరగం పార్వతి ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు మాతృభాష యొక్క అవశ్యకతపై అవగాహన కల్పించారు. మాతృభాషలోనే పిల్లలకు బోధించాలని, సామాజిక నైపుణ్యాలను పెంపుదించాలని, మాతృభాష గొప్పతనాన్ని చిన్నతనం నుంచే పిల్లలకు తెలియజేయాలని ఆమె సూచించారు. అంగన్‌వాడీ ఆయా పద్మ, ఆశ కార్యకర్త శాంతమ్మ పాల్గొన్నారు.

రంపచోడవరం: రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ అధ్యక్షతన అంతర్జాతీయ మృతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మాతృభాషపై మక్కువ పెంచుకోవాలన్నారు. మాతృభాషపై పట్టు ఉంటే ఇతర భాషల్ని నేర్చుకోవచ్చన్నారు. తెలుగు అధ్యాపకుడు రవికుమార్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై గ్రామాల్లో ప్రచారం

జి.మాడుగుల: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కె.విజయగౌరికి మద్దతుగా నాయకులు గాంధీనగరంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో శుక్రవారం ప్రచారం చేశారు. ఉమామహేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.షెడ్యూల్డ్ ఏరియాలో ఆదివాస నిరుద్యోగ యువతకు శతశాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే జీవో నంబరు-3 అవశ్యకతను శాసన మండలిలో ప్రస్తావించి పునరుద్ధరణకు తనవంతు కృషి చేస్తానన్నారు. తనకు మద్దతు తెలియజేయాలని కోరారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తుల రెడ్డి, యూటీఎఫ్ నేత రామకృష్ణ, డిగ్రీ కళాశాల గ్రంథాలయ అధికారి జగత్‌రాం పాల్గొన్నారు.

వి.ఆర్.పురం: మండలంలోని రేఖపల్లి రాజుపేట, చింతరేగుపల్లి, రామవరం, చొప్పాలి గ్రామాల్లో నాయకులు శ్రీనివాసరావు, రత్నాకర్ తదితరులు ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పి.రాజశేఖరంనకు మద్దతుగా ప్రచారం చేశారు.

విధిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి


సుర్మతిలో రైతుల నమోదు చేస్తున్న ఏఈవో ప్రశాంత్


రాజవొమ్మంగిలో సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సావిత్రి

జి.మాడుగుల: మండలంలోని ప్రతీ ఒక్క రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో వివరాలు నమోదు చేసుకొని విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని మండల వ్యవసాయ శాఖ అధికారి పాత్రుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సచివాలయల పరిధిలో ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం చేపడుతున్నట్టు . రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని, దీనిపై ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తారని చెప్పారు. పథకాలు పొందేందుకు రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఉండాలని, ఈ మేరకు రైతులు తమ వివరాలు పూర్తిగా నమోదు చేసుకోవాలన్నారు. రైతులకు ప్రభుత్వ పథకాలు, రాయితీలు, బ్యాంకు రుణాలు ఇతర సౌకర్యాలు సులభంగా పొందటానికి అవకాశం ఉంటుందన్నారు. రైతులు తమ ఆధార్‌కార్డు, అనుసంధానం చేసిన ఫోన్ నంబర్, పట్టా-1బి, అడంగల్ కాపీ, రీసర్వే అయినటువంటి గ్రామాల్లో ఎల్‌పీ నంబర్ తీసుకొని గ్రామ సచివాలయాలను సంప్రదించాలన్నారు. మండలంలో పీఎం కిసాన్ లబ్ధిదారులు 11,975 మంది ఉండగా వారందరీ వివరాలు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

రాజవొమ్మంగి: ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ ద్వారా రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వడం జరుగుతుందని, తద్వారా వ్యవసాయ, ఉద్యానవన శాఖ సేవలు అనుసంధానం చేయడం జరుగుతుందని అడ్డతీగల ఏడీఏ కంకిపాటి సావిత్రి అన్నారు. ఆమె శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, వ్యవసాయ ఉద్యానవనశాఖ గ్రామ సహాయకుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. రిజిస్ట్రేషన్‌కు ఆఖరి గడవు ఈ నెల 28వ తేదీ అని వెల్లడించారు. రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రామాలయ ప్రతిష్ట వేడుకలు ప్రారంభం


వేచలంలో రామాలయ విగ్రహ ప్రతిష్ట పూజల్లో పాల్గొన్న భక్తులు


విద్యుత్ కాంతులతో కళకళలాడుతున్న రామాలయం

దేవరాపల్లి: మండలంలోని వేచలంలో సీతారామ సహిత విష్ణ్వేశ్వర స్వామి, లక్ష్మీదేవి ఆలయ విగ్రహ ప్రతిష్ట వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం ఊరేగింపు కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దీంతో వేచలంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించిన రామాలయం కళకళలాడుతోంది. ఆఖరి రోజు ఆదివారం ధ్వజస్తంభం, ఆలయ శిఖర, విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. చివరి రోజు భారీ అన్నసమారాధన, పౌరాణిక నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

పూతదశలో నువ్వు సాగు


గరుగుబిల్లిలో నువ్వుపంట

కె.కోటపాడు: మండలంలో రైతులు రబీ పంటగా నువ్వు సాగు చేస్తున్నారు. ఖరీఫ్ వరి కోతలు పూర్తయిన పొలాల్లో నువ్వు పంట వేశారు. ఈ పంటకు నీటి సాంద్రత తక్కువగా ఉన్నా దిగుబడి బాగుంటుందని రైతులు చెబుతున్నారు. వేసవి దృష్ట్యా ప్రధానంగా నీటి లభ్యత ఉన్న వ్యవసాయ బావులు, సాగునీటి చెరువుల సమీపంలో పొలాల్లో సాగు చేస్తున్నారు. డి.అగ్రహారం, గుల్లేపల్లి, రామచంద్రపురం, కింతాడ, పిండ్రంగి, పోతనవలస, ఆర్లి, చౌడువాడ, ఎ.భీమవరం, పాడుగుపాలెం, పైడంపేట, గరుగుబిల్లి గ్రామాల్లో 120 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మార్కెట్‌లో నువ్వులకు మంచి డిమాండ్ ఉన్న కారణంగా సాగు లాభదాయకంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం పంట పూతదశకు చేరుకుంది.

ప్రమాదకరంగా ఇంకుడు గుంతలు

- అసంపూర్తిగా పనులు
- పెరుగుతున్న ప్రమాదాలు
- ఆందోళనలో గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు


అప్పలరాజుపేటలో ఇంకుడు గుంతల కోసం తవ్విన గోతులను చూపిస్తున్న గ్రామస్తులు

రాజవొమ్మంగి: మండలంలోని అప్పలరాజుపేట గ్రామంలో ఇంకుడు గుంతలు ప్రమాదకరంగా మారాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో 40 రోజుల క్రితం ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడు గుంతల నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రతి ఇంటి ఆవరణలో సుమారు ఆరు అడుగుల లోతున గోతులు తవ్వి వదిలేశారని గ్రామస్తులు చెబుతున్నారు. ఆయా గోతుల్లో పశువులు, చిన్నారులు పడి గాయాలబారిన పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకరంగా మారాయని చెబుతున్నారు. గ్రామంలో సుమారు 40 ఇంకుడు గుంతలు అసంపూర్తిగా ఉన్నాయని చెబుతున్నారు. గ్రామంలో అసంపూర్తిగా ఉన్న ఇంకుడు గుంతల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సమస్యపై అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై స్థానిక ఉపాధి హామీ కార్యాలయం ఏపీవో రెడ్డిబాబు మాట్లాడుతూ మండలానికి కేవలం 10 రోజుల క్రితం 1263 ఇంకుడుగుంతలు మంజూరైనట్టు తెలిపారు. అంతకు ముందు తవ్విన గోతుల విషయం తన దృష్టికి రాలేదన్నారు. అయితే గ్రామానికి వెళ్లి పరిస్థితిని సమీక్షిస్తానని చెప్పారు.

ముమ్మరంగా మినప పంట తీత

మాడుగుల రూరల్: మండలంలో ముమ్మరంగా మినప పంట తీత పనులు చేస్తున్నారు. మండలంలో మినప, పెసర కలిపి 321 హెక్టార్లలో సాగు చేశారు. ప్రస్తుతం మినప పంట తీత పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. పెసర పంట కొన్ని గ్రామాల్లో ఇంకా పండలేదు. ప్రస్తుతం ఉపాధి పనులు ప్రారంభం కావడంతో కూలీల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు చెరకు తోటలు చేసే పనిలో ఉన్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ ఈ ఏడాది ఆలస్యంగా ప్రారంభించడంతో ఒకే సారి చెరకు కటింగ్, మరో వైపు అపరాలు తీత పనుల్లో రైతులు బిజీబిజీగా ఉన్నారు.

పీసా చట్టంతో గిరిజనులకు సంపూర్ణ రక్షణ


అడ్డతీగలలో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయ


రంపచోడవరంలోని శిక్షణ పూర్తి చేసుకున్న పీసా కమిటీ సభ్యులు, తదితరులు


గంగవరంలో మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మణరావు


పెదబయలులో మాట్లాడుతున్న కేంద్ర పరిశీలకుడు మోహన్‌రావు తదితరులు

అడ్డతీగల: పీసా చట్టం ద్వారా గిరిజనులకు సంపూర్ణ రక్షణ కలుగుతుందని అడ్డతీగల ఎంపీడీవో కె.ఆర్.విజయ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయాల సిబ్బందికి పీసా చట్టంపై శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విజయ మాట్లాడుతూ చట్టాల నియమ, నిబంధనలు, హక్కులు, బాధ్యతలు వంటి వాటిపై ప్రజలను చైతన్య వంతులను చేయాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు పీసా కమిటీల తీర్మానాలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. శిక్షణ పర్యవేక్షకుడు చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల(గంగవరం): పీసా చట్టం నూరుశాతం అమలుకు పాటుపడాలని గంగవరం ఎంపీడీవో వై.లక్ష్మణరావు అన్నారు.పీసా చట్టాలపై స్వయం సహాయక సంఘాల మహిళలు, సచివాలయాల సిబ్బందికి శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పీసా చట్టంపై అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలన్నారు. ఉపాధి హామీ ఏపీవో ప్రకాశ్, వెలుగు ఏపీఎం షణ్ముకేశ్వరరావు, పంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: మండల కేంద్రంలోని ఎంపీడీవో, వెలుగు కార్యాలయాల్లో పీసా చట్టంపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర పరిశీలకుడు మోహన్ రావు, ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య మాట్లాడుతూ పీసా చట్టం అమలు, నియమావళిపై రోజూ 200 మందికి శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజుబాబు, రాష్ట్ర పరిశీలకుడు ప్రసాద్, ఈవోఆర్‌డీ నర్సింగరావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: పీసా కమిటీలను బ్యాచ్‌ల వారీగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నమని, సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం ఎంపీడీవో సుండం శ్రీనివాసుదొర అన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీసా కమిటీ సభ్యులు గ్రామస్తులతో కలిసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. స్థానిక ఎమ్మార్సీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పీసా కమిటీ కార్యదర్శి, ఉపాధ్యక్షులు, వార్డు మెంబర్లు, ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులకు శిక్షణ ఇచ్చారు. కోర్సు డైరెక్టర్‌గా పద్మజ, ఎంవోటీగా మహేశ్వరరావు వ్యవహరించారు.

టాలెంట్ టెస్ట్ రేపు

దేవరాపల్లి: కాశీపురం హైస్కూల్‌లో ఆదివారం టెన్త్ విద్యార్థులకు మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు కాశీపురం స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం 12:30 నుంచి 02:30 వరకు టెస్ట్ జరుగుతుందన్నారు. మల్టీపుల్ చాయిస్ విధానంలో వంద మార్కులకు పరీక్ష ఉంటుందన్నారు. విజేతలుగా నిలిచిన వారికి జ్ఞాపికలతోపాటు పరీక్షకు హాజరైన ప్రతి ఒక్కరికీ స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9397903790, 7569133164లను సంప్రదించాలని కోరారు.

రామాలయంలో విగ్రహ ప్రతిష్ట రేపు

నాతవరం: మర్రిపాలెం పంచాయతీ శివారు వెన్నలపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని ఈ నెల 23న ప్రారంభించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రామాలయం ప్రాంగణంలో శుక్రవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. శనివారం ఈ పూజా కార్యక్రమాలు కొనసాగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం విగ్రహ ప్రతిష్ట, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.